క్లుప్తంగా

మొక్కలు సంరక్షించాలి



మొక్కలు నాటిన చైర్మన్,కమిషనర్

రాయికల్: నాటిన ప్రతీ మొక్కను పరిరక్షించాలని రాయికల్ మున్సిపల్ చైర్పన్ మోర హన్మాండ్లు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని 1 వార్డులో సోమవారం మొక్కలు నాటారు. స్థానిక ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంద్ర రమాదేవి, కమిషనర్ చిరంజీవి,కౌన్సిలర్లు మారంపెల్లి సాయికుమార్,తురగశ్రీధర్‌రెడ్డి,అనుమల్లదివ్య, మ్యాకల అనురాధ, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ భూమి కబ్జాపై ఫిర్యాదు



ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వెల్లులలో ఎస్సారెస్పీ భూమి కబ్జాకు గురైందని మెట్‌పల్లి ఆర్డీవో,ఎస్సారెస్పీ,తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన చిన్న పుల్లయ్య అనే వ్యక్తి కొంత భూమిని ఆక్రమించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.కెనాల్ భూమి రెండు వైపులా ఎంత వరకు ఉందో చూపించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి



మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

పెగడపల్లి: లక్ష్యం మేరకు మొక్కలు నాటి వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ ప్లాంటేషన్‌ను ఆయన సోమవారం సందర్శించారు. నాటిన మొక్కలు, వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి మాట్లాడారు. 23 గ్రామాల్లో 2.30 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ దిశగా పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది అనువైన స్థలాలను గుర్తించి మొక్కలు నాటించాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశం పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ



చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్: మండలంలోని సిరికొండలో పలువురికి మంజూరైన సీఎమ్మార్ఎఫ్ చెక్కులను సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. 12 మంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు నాయకులు వెళ్లి చెక్కులను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎం.డీ హఫీజ్, మ్యాదరవేని రాజు, దూలూరి శ్రీధర్, ఎం.డీ రేహన్, ముంజ శంకర్, అర్జున్ గౌడ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ గండ్లను పూడ్చాలి



తహసీల్దార్ ప్రసాద్‌కు విన్నవిస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం: కాకతీయ కాలువ గండ్లను పూడ్చాలని పలుసార్లు ఎస్సారెస్పీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజావాణిలో సోమవారం తహసీల్దార్ ప్రసాద్‌కు రైతులు విన్నవించారు. కాల్వ గండ్లను పూడ్చకపోతే వర్షాకాలం కాల్వలు కోతకు గురై ప్రమాదం ఉందని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు తీగల విక్రమ్‌రెడ్డి, నల్ల రమేశ్ రెడ్డి, ఎలేటి చిన్నారెడ్డి, గూడ భూమారెడ్డి, గూడ ముత్యం రెడ్డి, పుప్పెం ముత్తన్న, తీగల శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాయికపుగూడెం కేంద్రంలోని ప్యాడీ క్లీనర్



లక్ష్మీదేవిపల్లిలో..



పెంబట్లలో..



అర్పపల్లి కేంద్రంలో..

పాడయ్యాక పట్టించుకుంటారా..?

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ప్యాడీ క్లీనర్లు సీజన్ పూర్తి కావడంతో ఎక్కడికక్కడే వదలిపెట్టారు. అవి వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ తుప్పుపడుతున్నాయి. ధాన్యంలోని చెత్త, తాలు, తప్ప, మట్టి పెళ్లలు తొలగించడానికి ఉపయోగించే ఈ ప్యాడీక్లీనర్లను భద్రపర్చాల్సిన అధికారులు, నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా వాటిని భద్రపరచాలని రైతులు కోరుతున్నారు. – సారంగాపూర్

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి





ఇబ్రహీంపట్నం, వాల్గొండలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు,పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది

మల్లాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచి బలోపేతం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శంకరమ్మ, భారతి అన్నారు. సోమవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఞఅమ్మమాట–అంగన్‌వాడీ బాట౯౯ కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోలు, విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, హెచ్ఎంలు, స్థానిక నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగిత్యాల: చిన్నారులను అంగన్‌వాడీ పాఠశాలలకు పంపించాలని సీడీపీవో వరలక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవితరాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో అంగన్‌వాడీ బడిబాట ర్యాలీలు

కథలాపూర్: మండలంలోని దుంపేట, కథలాపూర్, రాజారాం తండా, భూషణరావుపేట, సిరికొండ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం 'అమ్మ మాట– అంగన్‌వాడీ బాట' ర్యాలీలు నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలో సోమవారం అమ్మ మాట..అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలతో కలిసి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని టీచర్లు కోరారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మల్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమమవారం విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రతిభ, హెచ్ఎం వాణి, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం శివారులో గండిపడిన కాకతీయ కాలువ

కాకతీయ కాలువకు గండి

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రం శివారులోని కాకతీయ కాలువకు గండి పడి, నీళ్లు వృథాగా పోతున్నాయి. 2 నెలల క్రితమే గండి పడినా ఎస్సారెస్పీ అధికారులు మరమ్మతు చేయించలేదని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు రూ.10 వేలు ఖర్చు పెట్టి ప్రమాదం జరుగకుండా ఇసుక సంచులను అడ్డుగా వేశారు. వర్షాలు కురిసి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండి కాకతీయ కాలువకు నీటిని విడుదల చేస్తే ఈ గండి తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. వెంటనే గండిని పూడ్చివేయకపోతే ఇబ్రహీంపట్నం శివారులోని సుమారు 600 ఎకరాల పంటనష్టం జరగడటంతో పాటు ఇబ్రహీంపట్నం, ఎర్దండి పెద్ద చెరువులోకి నీళ్లు వెళ్లి చెరువులు కూడ తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు తెలుపుతున్నారు. వెంటనే ఎస్సారెస్పీ అధికారులు, గండిని పూడ్చివేయాలని రైతులు కోరుతున్నారు.

సమ్మె డిమాండ్లు నెరవేర్చాలి



జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

జగిత్యాలటౌన్: అంగన్‌వాడీల సమ్మె కాలపు డిమాండ్లు నెరవేర్చాలని, జీవో 10ని రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. శ్రీకాంత్ మాట్లాడుతూ 24రోజుల సమ్మె సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా నాయకులు వి.వెంకటాచారి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రజిత, శారద, స్వప్న, సునీత, మల్లమ్మ, ఎల్లవ్వ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ధర్మపురి:అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ప్రభుత్వం అందిస్తున్న వేతనం సరిపోవడం లేదన్నారు. అంగన్‌వాడీలకు రూ.26వేలకు పెంచాలని కోరారు. వివిధ మండలాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జగిత్యాల: ప్రతీ ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలం దోమలు పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలువార్డుల్లోని మురికి కాల్వలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మురికి కాల్వలను శుభ్రం చేయించేలా చూడాలని, పిచ్చి మొక్కలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అశోక్, రాము ఉన్నారు.



మురికికాల్వలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

అదనపు కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్

ఇటీవల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా నియమితులైన జెడ్పీ సీఈవో గౌతంరెడ్డిని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆమె వెంట నాయకులు లక్ష్మణ్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



చెక్కు అందిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన బీజేపీ బూత్ స్థాయి కార్యకర్త ఆరవెల్లి శేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, మృతుడి భార్య రాణికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సోమవారం బూత్ స్థాయిల సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయల చెక్కును అందించారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన బీజేపీ గ్రామ కార్యకర్త రాజారపు శ్రీనివాస్ ఇటీవల అనార్యోగంతో మృతిచెందగా ధర్మపురి ఫౌండేషన్ బూత్‌స్థాయి సభ్యుల సంక్షేమ నిధి నుంచి సోమవారం రూ.లక్ష చెక్కును కుటుంబ సభ్యులకు ఎంపీ అర్వింద్ అందజేశారు.

'జీవన్ రెడ్డిని విమర్శించే హక్కు లేదు'

రాయికల్: రాయికల్ పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ కౌన్సిలర్లకు లేదని కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ మ్యాకల అనురాధ అన్నారు. సోమవారం రాయికల్ ఆమె మాట్లాడారు. గత పదేళ్లు టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులు మరిచిపోయి నేడు టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిన తర్వాత విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రతిపక్ష పాత్రలో ఉన్నప్పుడు కూడా పట్టణంలో తన నిధులతో రోడ్ల నిర్మాణం,. తాగునీటి సమస్య పరిష్కరించారరి గుర్తు చేశారు. ఫైర్ స్టేషన్ పునః ప్రారంభం తోపాటు ఫిల్టర్ బెడ్ పనులు పునః ప్రారంభించి పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తామని అన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, కొయ్యడి మహిపాల్‌రెడ్డి, దివాకర్ రెడ్డి, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫ్లోర్ లీడర్ మ్యాకల అనురాధ

బీసీ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో బీసీ నాయకులు

జగిత్యాలక్రైం: నిరుద్యోగుల ధర్నాకు మద్దతుగా సోమవారం హైదరాబాద్ వెళ్తారనే సమాచారం మేరకు బీసీ సంక్షేమ సంఘం నాయకులను పట్టణ సీఐ వేణుగోపాల్ ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

రాయికల్: నిరుద్యోగుల ధర్నాకు మద్దతుగా హైదరాబాద్ తరలివెళ్తున్నారనే సమాచారంతో సోమవారం బీసీ సంఘం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. మండల అధ్యక్షుడు సాయిరాజ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సామల సతీష్, యువజన సంఘం అధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి విజయ్, నియోజకవర్గ కన్వీనర్ రంజిత్, మండల ఉపాధ్యక్షుడు నాగరాజు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

సారంగాపూర్ వాసికి ఎంటెక్‌లో గోల్డ్‌మెడల్

సారంగాపూర్: మండల కేంద్రానికి చెందిన కుసుంభ శుభకర్ ఎంటెక్ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో యూనివర్శిటీ టాపర్‌గా నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. హైదరాబాద్ గచ్చిబౌలి ఐఐటీ యూనివర్శిటీలో ఎంటెక్ ఆడెడ్ కంప్యూటరైజ్డ్ స్ట్రక్చరల్ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. హైదరాబాద్‌లోని బ్రహ్మకుమారి శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో జరిగిన యూనివర్శిటీ 23వ స్నాతకోత్సవంలో కౌన్సిల్ ఆఫ్ సెంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ ఎన్. కలైసెల్వి శుభకర్‌కు గోల్డ్‌మెడల్‌తో పాటు పట్టాను ప్రదానం చేశారు. శుభకర్ ప్రస్తుతం పూణేలో సివిల్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తూ అక్కడే పీహెచ్‌డీ చేస్తున్నాడు. తన చదువుకు ప్రోత్సాహం అందించిన అమ్మ సంగీత, నాన్న శ్రీనివాస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శుభకర్ గోల్డ్‌మెడల్ సాధించడంపై ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, రమణ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, సారంగాపూర్ గ్రామస్తులు అభినందించారు.

అదనపు బస్సు ఏర్పాటుపై విద్యార్థుల హర్షం

ధర్మపురి: మగ్గిడి గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులకు సరిపడా బస్సులు లేకపోవడంతో సకాలంలో పాఠశాలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇటీవల ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు తమ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. స్పందించిన విప్ లక్ష్మణ్‌కుమార్ జగిత్యాల డీఎంతో ఫోన్‌లో మాట్లాడి సోమవారం మగ్గిడికి అదనపు బస్సు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు విప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గోరింటాకు వేడుకలు

మేడిపల్లి: ఆషాడమాసం సందర్భంగా మేడిపల్లి మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చేతులకు గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. ఆషాడ మాసంలో గోరింటాకు వేడుకలు నిర్వహిస్తామని మహిళ ఉపాధ్యక్షురాలు దేశవేని రమ్య అన్నారు. కార్యక్రమంలో ఆర్మూరి లత, తోపారపు రేఖ, లావణ్య, సూరమ్మ, మంజుల, రాధ, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ధర్మపురి: పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1969 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 55 ఏళ్ల క్రితం చదువుకున్నప్పుడు విద్యార్థి దశలో చేసుకున్న చిలిపి చేష్టలు, జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ముందుగా తమకు విద్య నేర్పిన గురువులను స్మరించుకున్నారు. కార్యక్రమానికి అతిథిగా సంగనభట్ల పెద్ద రామకిష్టయ్య హాజరై పూర్వ విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు.

సీడ్స్ డెవలమెంట్ కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందన



అన్వేశ్‌రెడ్డిని అభినందిస్తున్న నాయకులు

మల్లాపూర్: రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సుంకేట అన్వేష్‌రెడ్డికి సోమవారం కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో పదవీ బాధ్యతలు చేపట్టగా, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజీత్ రావు, కిసాన్‌కాంగ్రెస్ రాష్ట్ర కన్వీనర్ వాకిటి సత్యంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, ఫీషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి వేర్వేరుగా కలిసి ఆయనను సన్మానించారు.

యువతపై దేశ భవిత ఆధారపడి ఉంది



మాట్లాడుతున్న వక్తలు

జగిత్యాల: యువతపై దేవ భవిత ఆధారపడి ఉందని రామకృష్ణ, నలంద డిగ్రీ కళాశాలల చైర్మన్లు రామకృష్ణ, నరేశ్ అన్నారు. సోమవారం యువ నైపుణ్య దినోత్సవం పురస్కరించుకుని మాట్లాడుతూ నైపుణ్యం గల యువత కొరత చాలా ఉందని, విద్యార్థులు కేవలం మార్కులు సాధించడంపైనే దృష్టి ఉంచుతున్నారని, దీనికి బదులు నైపుణ్యతపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్లు ఢీకొని పలువురికి గాయాలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట శివారులో రెండు కార్లు ప్రమాదానికి గురయ్యాయి. సోమవారం కమ్మర్‌పల్లి వైపు నుండి వస్తున్న కారు, నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మెట్‌పల్లికి చెందిన రాజయ్యకు కాలు విరిగింది. మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



రిషిక

మల్లాపూర్: మండలంలోని వీవీరావుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి గనవేని రిషిక ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు ఎంఈవో భీమయ్య, హెచ్ఎం దత్తాద్రి తెలిపారు. రిషిక నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికవడం పట్ల మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా మొహర్రం



జగిత్యాలరూరల్: మండలంలోని పోరండ్లలో సోమవారం మోహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీరీలను డప్పు చప్పుళ్లతో ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామ శివారులోని ఊర చెరువులో నిమజ్జనం చేశారు.

రాయికల్: మండలంలోని దావన్‌పల్లిలో సోమవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా పీరీలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు దస్తీలు కట్టి తమ మొక్కలు చెల్లించుకున్నారు.

ధర్మపురి : మొహర్రం వేడుకల్లో భాగంగా పట్టణంలో సోమవారం చిన్న సర్గత్తి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన సమీర్ ఆధ్వర్యంలో పీర్లు, లాల్సావులను ఉదయం మసీదుల నుండి ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తుల పూనకాలతో మారుమోగింది.